సీపీకి జ్ఞాపిక అందజేత



సీపీ సి.వి.ఆనంద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మహ్మద్ జాహెద్

గోల్కొండ: గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల సంక్షేమ సంఘం కన్వీనర్ మహ్మద్ జాహెద్ సీపీ సి.వి.ఆనంద్‌ను ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ మాట్లాడుతూ.. దివ్యాంగులను చూస్తుంటే తనకు ఎంతో స్ఫూర్తి కలుగుతుందన్నారు.

చెన్నకేశవ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



అబిడ్స్: చెన్నకేశవ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఖాజా వెంకట వసంత, సవరయ్య మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ పూలు, కూరగాయల మార్కెట్‌కు వచ్చేవారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

అగ్రసేన్ బ్యాంక్ సేవలు అభినందనీయం



అగ్రసేన్ బ్యాంకు పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

గోల్కొండ: అగ్రసేన్ బ్యాంక్ సేవలు అభినందనీయమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్‌లో బ్యాంక్ 5వ బ్రాంచ్‌ని ఆదివారం ప్రారంభించారు. నగరంలో మరో మూడు బ్రాంచ్‌లు ప్రారంభించనున్నట్లు బ్యాంకు సీఈవో సి.వి.రావు తెలిపారు. కార్యక్రమంలో వేమిరెడ్డి నర్సింహ్మారెడ్డి, మనీశ్ అగర్వాల్, అమ్రత్‌కుమార్ జైన్, హరినారాయణ్ రాతి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా శ్రీనివాస్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నూతన ఆర్థిక అధికారి(ఫైనాన్స్ ఆఫీసర్)గా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆర్థిక, అకౌంట్లు, ఆడిట్, ప్రభుత్వ నిబంధనలు వంటి అంశాలపై 27 ఏళ్ల అనుభవం ఉన్న వ్యక్తికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బిజేరావు మాట్లాడుతూ హెచ్‌సీయూ ఆర్థిక స్థిరత్వం, వియాన్ని నిర్ధారించడంలో కీలకంగా వ్యవహరిస్తాడని భావిస్తున్నామన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

అత్తాపూర్: పేదలను ఆదుకునేందుకు నిరంతరం సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని అల్ ఖరీమ్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహ్మద్ అబ్దుల్ ఖరీమ్ ఫహీమ్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని అత్తాపూర్ హుడా కాలనీలోని మజీద్ ఈ అశ్రఫ్‌లో నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలన్నారు. తమవంతు బాధ్యతగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మౌలానా మహ్మద్ హబీబ్, రహమాన్ హుసేనీ, అబ్దుల్ మాజీద్, హఫీజ్, అబ్దుల్ జబ్బార్, మౌజూద్ తదితరులు పాల్గొన్నారు.

మగ్గం పనిలో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మగ్గం పనిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ రీసెట్ డైరెక్టర్ జీఎస్ఆర్ కృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముచ్చింతల్ శివారులోని ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 30 రోజుల పాటు సాగే ఈ శిక్షణలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఈ శిక్షణకు హాజరుకావచ్చునన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ 7893121143 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నాలాలు..ఎన్నాళ్లిలా..?

- అధ్వానంగా మురుగునీటి డ్రైనేజీలు
- కుంగిన మూతలు, అసంపూర్తి పనులు
- తరచూ ప్రమాదాల బారిన ప్రజలు
- తూతూమంత్రంగా మరమ్మతులు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ యంత్రాంగం



ఓల్డ్‌మల్లేపల్లి-కుమ్మర్‌వాడీ చౌరస్తాలో కుంగిన నాలా పైకప్పు



నాలామీదే ట్యాంకర్‌ను పార్కింగ్ చేసి నీటిని నింపుతున్న దృశ్యం



పైకప్పు పూర్తికాని ఫిరోజ్‌గాంధీనగర్-అఫ్జల్‌సాగర్ వెళ్లే నాలా

నాంపల్లి: మురుగునీటి నాలాలు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఓవైపు పురాతనమైనవి కావడం, మరోవైపు వాటిలో పేరుకుపోయిన పూడికను సకాలంలో తీయకపోవడం, వాటిపై నుంచే భారీ వాహనాలు వెళ్తుండడంతో పైకప్పులు కూలిపోయి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ధ్వంసమైన నాలాలకు తాత్కాలిక మరమ్మతులే తప్ప శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ఓల్డ్ మల్లేపల్లి ఫీల్‌ఖానా చౌరస్తాలోని నాలా తరచూ కూలిపోతోంది. అలాగే రెండేళ్ల కిందట ప్రారంభమైన ఫిరోజ్‌గాంధీనగర్ నాలా మరమ్మతులు సైతం కొనసా..గుతూనే ఉన్నాయి. ఫలితంగా ఈ రహదారుల్లో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

సకాలంలో పునరుద్ధరణ జరిగేనా..

ఎప్పటికప్పుడు మురుగునీటి నాలాలను పునరుద్ధరించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు సకాలంలో పూర్తి చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుంగిన పైకప్పు ప్రదేశంలో బారికేడ్లు ఏర్పాటు చేసి నెలల తరబడి పనులు ప్రారంభించకుండానే జాప్యం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు నాణ్యత లేని పనులతో మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలుతున్నాయి. ఇందుకు ఓల్డ్ మల్లేపల్లి ఫీల్‌ఖానా మురుగునీటి నాలా ఏడాదిలోనే మూడుసార్లు కూలిపోవడమే నిదర్శనం. ఆసిఫ్‌నగర్ కుమ్మర్‌వాడీ నుంచి ఫీల్‌ఖానా మీదుగా ప్రవహించే ఈ నాలా అఫ్జల్‌సాగర్‌నాలాలో కలుస్తుంది. ప్రస్తుతం ఈ నాలా కుమ్మర్‌వాడీ చౌరస్తాలో కుంగి నెలరోజులవుతున్నా.. ఇప్పటికీ పునరుద్ధరణకు నోచుకోక స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నాలా పై కప్పును పూర్తిగా తొలగించి, శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ఇదే రూట్‌లోని నోబుల్ టాకీస్ చౌరస్తా దగ్గర, మిర్చి దుకాణం మలుపులో నెల వ్యవధిలోనే రెండుసార్లు మ్యాన్‌హోల్ పగిలిపోయింది. అయినా సిమెంట్‌తో మెరుగులు దిద్దడం, దానిపై దిమ్మెను ఉంచి వదిలేస్తున్నారు. ఇవి కూడా తరచూ పగిలి స్థానికుల రాకపోకలకు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్నాయి.

భారీ వాహనాల రాకపోకలతోనే..

ఓల్డ్‌మల్లేపల్లి ఫీల్‌ఖానా రహదారిలో భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో వెళ్తుంటాయి. వీటి బరువు కారణంగా నాలా పైకప్పు కూలిపోతోంది. ఇక్కడ వాటర్ ట్యాంకర్లు నాలా పైకప్పు మీదే పార్కింగ్ చేసి నీటిని తోడేస్తుంటారని ఫలితంగా నాలా పైకప్పు దెబ్బతింటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫీల్‌ఖానాలో అక్రమంగా నడిచే వాటర్ సంపును బంద్ చేయించాలని ఆసిఫ్‌నగర్ తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన నాలాలను పునరుద్ధరించడంతో పాటు అవసరమైన చోట్ల కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ముగిసిన ‘వర్వ్-2025’



క్రీడాకారులతో మాట్లాడుతున్న శ్రీవిద్యారెడ్డి

గోల్కొండ: ఇంజినీరింగ్ కాలేజీ స్పోర్ట్స్ మీట్‌కు తమ కళాశాల వేదిక కావడం ఆనందంగా ఉందని షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి అన్నారు. 11వ జాతీయ ఇంటర్ ఇంజినీరింగ్ కాలేజీ స్పోర్ట్స్ మీట్ ఫర్ ఉమెన్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ నికత్‌భాను హాజరై మాట్లాడుతూ.. తాను కూడా మహిళా విభాగంలో ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. డిలైట్ కంపెనీ డెలివరీ మేనేజర్ ఎం.అఖిల మాట్లాడుతూ..జీఎన్ఐటీఎస్ అలూమీనిగా తాను మరోసారి ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ చైర్మన్ జి.రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ అపర్ణ పల్లె, వర్వ్-2025 కన్వీనర్ డాక్టర్ ఎం.వీ.ఎల్.సూర్యకుమారి పాల్గొన్నారు.

‘డోర్ సమాజ్‌ను గ్రూప్–బీ లోనే కొనసాగించాలి’



వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్, ప్రతినిధులు

జియాగూడ: నిరుపేదలైన ఎస్సీ డోర్ కమ్యూనిటీని గ్రూప్–బీ లోనే కొనసాగించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కోరారు. ఈ మేరకు ట్యాంక్‌బండ్ బూర్గుల రామకృష్ణ భవన్‌లో మాజీ న్యాయమూర్తి షమీమ్ అక్తార్ సిబ్బందిని ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జియాగూడ డోర్ సమాజ్ అధ్యక్షుడు దత్తు పోల్, ఉపాధ్యక్షుడు సురేశ్ గజరే, సభ్యులు వినోద్ చౌగ్లే, గణేశ్ కౌలే , ఉమేశ్ హిటకర్, రాజేంద్ర గజరే, జియాగూడ ఎంఐఎం ఇన్‌చార్జి ఫరూఖ్‌తో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. గత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో డోర్ కమ్యూనిటీని షెడ్యూల్ కులాల్లో చేర్చారని దీంతో వీరికి సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా ఎదుగుదలకు సహకారం లభించిందన్నారు. సర్వే చేసినా యథావిధిగా గ్రూప్–బీ లోనే కొనసాగించాలని ఆయన విన్నవించారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని చారిత్రక శ్రీ మాత పోచమ్మ తల్లి దేవాలయ ముఖద్వారం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ పూజ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయాన్ని భక్తులు, కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ముఖ ద్వారాన్ని నిర్మించేందుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఉమారెడ్డి, గణేష్, శ్రీధర్, కిరోసిన్ రాజు, పి.జంగయ్య, పి.వి.శ్రీనివాస్, శివరాములు, బి.బాల్‌రాజ్, రాకేశ్, వి.రమేశ్, కె.శంకర్, శ్రీకాంత్, కె.శ్రీను, మహేశ్, మెస్త్రి వెంకటేశ్, సతీష్, పంతులు రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో విజిబుల్ పోలీసింగ్



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు



మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్న దృశ్యం

అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఎస్ఓటీ పోలీసులతో కలిసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముష్క్ మహల్, నెక్‌లెస్ రోడ్, బారా ఇమార్ దర్గా , సెట్విన్ తదితర ప్రాంతాల్లో దాడులు నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశారు. ముష్క్ మహల్ ప్రాంతంలో మురారి ప్రభాకర్‌తో పాటు మరో ఇద్దరితో కలిసి మద్యం సేవిస్తుండటంతో కేసులు నమోదు చేశారు. పేకాట ఆడుతున్న కిషన్‌బాగ్‌కు చెందిన సయ్యద్ ఫక్రుద్దీన్, మొహమ్మద్ ఇమ్రాన్, అజీయుద్దీన్, మీర్ ఆజామ్ ఆలీ, సయ్యద్ మెరాజ్, మొహమ్మద్ వాజీద్, మొహమ్మద్ అజీమ్‌ల పై కేసులు నమోదు చేసి వారి నుంచి నుంచి రూ.60,520 నగదు, రెండు సోలార్ లైట్లు, ఆరు సెట్ల గేమింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 32/11కేవీ ఆదిత్య టవర్స్, కార్వాన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అరుణకాలనీ, జమాలికుంట, నదీంకాలనీ, గ్రామర్‌కాలనీ, పోలీస్ పిటి, ఘూన్సీనగర్, గోల్డెన్ ప్యాలెస్, నీరజ కాలనీ, మహబూబ్ గార్డెన్, చాంద్రా, అక్బర్‌బాగ్, రాజీవ్ గాంధీ నగర్, డిఫెన్స్‌కాలనీ, బాపునగర్, మెహిదీ కాలనీ, జితేందర్ ఫ్లోర్‌మిల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పాతబస్తీలో..

చార్మినార్: మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీజీఎస్పీడీసీఎల్ ఫలక్నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ క్వార్టర్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 వరకు, ఛత్రీనాక విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ట్రాఫిక్ సమస్యల్లేకుండా చర్యలు



యాకుత్‌పురా: రంజాన్ మాసం సందర్భంగా ట్రాఫిక్ సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్టేషన్‌లో మాట్లాడుతూ.. రంజాన్ నేపథ్యంలో స్టేషన్ పరిధిలోని హలీం విక్రయా కేంద్రాలు, స్థానిక వ్యాపారులతో సమావేశం నిర్వహించి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించామన్నారు. సాయంత్రం వేళల్లో రద్దీ ప్రాంతాలైన దారుషిఫా, పురానీహవేలీ, అలీజాకోట్లా, యాకుత్‌పురా, ఎత్తేబార్‌చౌక్, బీబీ బజార్ చౌరస్తా, చెత్తబజార్ తలాబ్‌కట్టా ప్రాంతాల్లో రౌండ్ ది క్లాక్ రెగ్యులర్ సిబ్బందితో పాటు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక వ్యాపారులు కూడా తమ సూచనలు పాటించి సహకరించాలని ఆయన కోరారు.

రంజాన్ పవిత్ర మాసం




మాట్లాడుతున్న కారీ మతీన్ ఆలీషా

గోల్కొండ: రంజాన్ పవిత్ర మాసం అని ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా కారీ సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా గోల్కొండలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిష్ఠగా దివ్య కురాన్ గ్రంథ పఠనంతో పాటు నిత్యం ఐదు పూటలు నమాజ్ చేయాలన్నారు. ఉపవాస దీక్ష విరమణ సమయంలో పేదలకు కూడా సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో మదర్సా విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

పాతబస్తీకి రంజాన్ కళ !

- ముస్లింల ఉపవాస దీక్షలు షురూ
- చార్మినార్ పరిసర ప్రాంతాలు కిటకిట
- గాజుల విక్రయాలకు ప్రసిద్ధి లాడ్‌బజార్



లాడ్‌బజార్‌లోని గాజుల దుకాణం



ఆకట్టుకుంటున్న రంగు రంగుల గాజులు

చార్మినార్: పాతబస్తీకి రంజాన్ కళ వచ్చింది. రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లింలు ఆదివారం తెల్లవారుజామున 5.11 గంటలకు సహెర్‌తో చేపట్టగా సాయంత్రం విరమించి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. దీంతో పాతబస్తీలోని మసీదుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. అలాగే చార్మినార్ చుట్టూ చిరు వ్యాపారాలు సైతం ఊపందుకున్నాయి.

ముస్తాబైన లాడ్‌బజార్..

రంజాన్ మాసాన్ని దృష్టిలో పెట్టుకుని చార్మినార్ పక్కనే ఉన్న లాడ్‌బజార్‌లోని దుకాణాలను మరింత అందంగా తీర్చిదిద్దారు. తీరొక్క గాజులు అందుబాటులో పెట్టడంతో పాటు బంపర్ ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. ఇక్కడ సహజ సిద్ధంగా లభించే మట్టి గాజులతో పాటు గోట్లు, మెటల్, డైమండ్స్, సీసం, బ్రాస్, ఫైబర్, మిర్రర్, ఎనామిల్ తదితర ఫ్యాషన్ గాజులు లభిస్తాయి.

లాడ్‌బజార్ అంటే..

లాడ్లా అంటే గారాబం.. ప్రేమ.. అనురాగం అని అర్థం. ఉర్దూ భాషలో తమకు ఇష్టమైన వారిని ముఖ్యంగా చిన్నారులను లాడ్లా అని సంబోధిస్తుంటారు. తమ ప్రేమకు, అభిమానానికి గుర్తుగా ఇక్కడ నుంచి కానుకను కొని బహూకరిస్తుండడం వల్ల దీనికి ఈ పేరు వచ్చిందని చెబుతుంటారు. మహ్మద్ కులీ కుతుబ్‌షా కూడా తన ప్రేయసి భాగమతికి ఇక్కడి లాడ్‌బజార్‌లోని గాజులనే బహుమతిగా ఇచ్చారని పెద్దలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇక్కడ దాదాపు 250కి పైగా దుకాణాలు ఉండగా, వీటి ద్వారా లక్షల్లో వ్యాపారం కొనసాగుతున్నది. ఇదిలా ఉంటే వినియోగదారులకు సరైనా పార్కింగ్ సౌకర్యం లేక అవస్థలు తప్పడం లేదని స్థానిక వ్యాపారులు అంటున్నారు. ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

‘స్థానిక సంస్థల్లో దివ్యాంగులను నామినేట్ చేయాలి’

జియాగూడ: రాష్ట్రంలోని పంచాయతీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేసేందుకు వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక హైదరాబాద్ సౌత్ కమిటీ గౌరవ అధ్యక్షురాలు పి.శశికళ కోరారు. ఈ మేరకు దివ్యాంగుల హక్కుల వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జియాగూడలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేసేందుకు ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నారన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ హామీ ఇచ్చిన ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టానికి సవరణలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో 25,538 వేల మందికి మున్సిపాలిటీల్లో 260, మున్సిపల్ కార్పొరేషన్లలో 26, మండల ప్రజా పరిషత్‌ల్లో 1080, జిల్లా పరిషత్‌లో 64 మందికి రాజకీయ అవకాశాలు వస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఎలాంటి ఆర్థిక భారం లేకుండానే 26,968 మందిని నామినేట్ చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ నగర ఉపాధ్యక్షుడు ఎస్.రాజు, సహాయ కార్యదర్శి నర్సింగ్, నాయకులు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై శ్రద్ధ పెట్టాలి



నానల్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులపై అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది చేపట్టిన పనులు కూడా పూర్తికాక పోవడంతో ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే గుత్తేదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. టోలిచౌకీ చౌరస్తా నుంచి ఎండీలైన్స్, టూమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పైపులు వేసేందుకు భారీ గుంతలు తవ్వి వదిలేశారని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట గోల్కొండ, నానల్‌నగర్ బల్దియా వార్డు కార్యాలయ సిబ్బంది, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

ముగిసిన మాతూరి నృత్య వర్క్‌షాప్



వర్క్‌షాప్ ముగింపు వేడుకల్లో మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఫోక్ కల్చరల్ ట్రైబల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 రోజులుగా రెడ్డి మహిళా కళాశాలలో మాతూరి నృత్యంపై నిర్వహించిన వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. అంతరించిపోతున్న కళలను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. 20 మంది విద్యార్థినులకు మాతూరి నృత్యాన్ని నిర్వాహకులు విశ్వకర్మ డీఆర్‌కే శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అచ్చుతదేవి, వైస్ ప్రిన్సిపాల్ సింధూరి, సుమిత్ర జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎన్ఐఏబీ’లో ముగిసిన వేడుకలు



పోటీల్లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు



రాయదుర్గం: గౌలిదొడ్డిలోని జాతీయ జంతు జీవ సాంకేతికత సంస్థ(ఎన్ఐఏబీ)లో మూడురోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. శుక్ర, శని, ఆదివారాల్లో విద్యావైజ్ఞానిక ప్రదర్శన, ప్రత్యేక ఉపన్యాసం మొక్కలు నాటే కార్యక్రమం, క్రీడా పోటీలను నిర్వహించారు. క్యాంపస్‌లో పలు రకాల మొక్కలను నాటారు. ఇదిలా ఉండగా ఎన్ఐఏబీ హైదరాబాద్ క్యాంపస్‌లో క్రీడాపోటీలనుగత నెలరోజులపాటు ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించారు. విధులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఈ వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించగా వాటిల్లో క్రీడా స్ఫూర్తితో ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి ఎన్ఐఏబీ డైరెక్టర్ డాక్టర్ జి తరుశర్మ బహుమతులను అందించారు.